సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 19 । ఆగస్టు । 2025



ఎన్నడూ ఎరగని కష్టం..
యూరియా కోసం రైతులు సొసైటీల ఎదుట బారులుదీరుతున్నారు. వర్షంలో తడుస్తూనే క్యూ కడుతున్నారు. 8లో



ఘనంగా పాపన్నగౌడ్ జయంతి
కలెక్టరేట్‌తోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఘనంగా నిర్వహించారు. 9లో

గరిష్ఠం / కనిష్ఠం
27° / 24°


వాతావరణం
జిల్లాలో మంగళవారం ఆకాశంలో మేఘాలు అలుముకుంటాయి. మధ్యాహ్నం జల్లులు కురిసే అవకాశం ఉంది.

తాలిపేరు నుంచి 23 వేల క్యూసెక్కులు విడుదల

చర్ల: తాలిపేరు మధ్య తరహా ప్రాజెక్ట్‌కు వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువ ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు వరద నీరు అధికంగా వస్తోంది. దీంతో సోమవారం రాత్రి పది గంటలకు ప్రాజెక్ట్ 10 గేట్లను ఎత్తి 23,015 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇన్‌ఫ్లో 20, 798 క్యూసెక్కులు వస్తోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 74 మీటర్లు కాగా వరద ఉధృతిని దృష్టిలో ఉంచుకుని నీటిమట్టాన్ని 72.30 మీటర్లుగా క్రమబద్ధీకరిస్తున్నారు. డీఈ తిరుపతి ప్రాజెక్టు వద్ద ఉండి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ప్రాజెక్ట్‌లోకి వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని డీఈ తెలిపారు.



తాలిపేరు నుంచి గోదావరిలోకి వదులుతున్న వరద జలాలు



ప్రాజెక్ట్ నుంచి విడుదలవుతున్న వరదనీరు

కిన్నెరసాని నుంచి 8 వేల క్యూసెక్కులు..

పాల్వంచరూరల్: ఎగువన కురుస్తున్న వర్షాలకు కిన్నెరసాని జలాశయంలోకి వరద ఉధృతి పెరిగింది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 407 అడుగులు కాగా, 2,700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, సోమవారం నీటిమట్టం 404.90 అడుగులకు చేరింది. దీంతో ప్రాజెక్టుకు చెందిన రెండు గేట్లను ఐదు ఫీట్ల మేర ఎత్తి ఉంచి 8 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తుననట్లు డ్యామ్‌సైడ్ ఏఈ తెలిపారు. భారీ వర్షాలకు గోదావరి వరద ఉధృతి పెరుగుతుండగా, వాగులు, వంకలు ఉప్పొంగుతున్నాయి. ఈ క్రమంలో రైతులు, ప్రజలు వాగుల సమీపంలోకి వెళ్లొద్దని, నిర్లక్ష్యంగా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని జిల్లా అధికారులు సూచించారు. నదీ పరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

రింగ్‌బండ్‌కు పోటెత్తిన వరద

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి వద్దనున్న పెదవాగు ప్రాజెక్ట్‌కు గతేడాది గండ్లు పడిన తర్వాత నిర్మించిన రింగ్‌బండ్‌కు సోమవారం వరదనీరు పోటెత్తింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్ట్ ఎగువ ప్రాంతంలోని వాగుల నుంచి వరదనీరు వచ్చి చేరుతోంది. ఈ క్రమంలో రింగ్‌బండ్ దెబ్బతినకుండా అప్రమత్తమైన నీటి పారుదల శాఖ అధికారులు పెదవాగు ప్రాజెక్ట్ మూడు గేట్లను ఎత్తి ఉంచి వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.



పెదవాగు ప్రాజెక్ట్ మూడు గేట్ల నుంచి వదులుతున్న వరదనీరు

గోదావరిలో వరద ఉధృతి



భద్రాచలం కరకట్ట వద్ద గోదావరి వరద ఉధృతికి నీట మునిగిన స్నానపు గదులు (ఇన్‌సెట్) దుమ్ముగూడెం మండలం పర్ణశాలలో పూర్తిగా నీట మునిగిన సీతమ్మవారి విగ్రహం

భద్రాచలంఅర్బన్/దుమ్ముగూడెం: భద్రాచలం వద్ద గోదావరిలో వరద ఉధృతి మూడు రోజుల నుంచి క్రమంగా పెరుగుతోంది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లడంతోపాటు ఎగువన ఉన్న కాళేశ్వరం తదితర ప్రాజెక్టుల నుంచి వరదనీరు వస్తోంది. దీంతో సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 36.50 అడుగులకు చేరింది. సాయంత్రం 5 గంటలకు 37.70 అడుగులకు పెరిగింది. నది ఒడ్డున మెట్లప్రాంతంలోని తాత్కాలిక స్నానపు గదులు నీటమునిగాయి. దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాల, కాశీనగరం, సున్నంబట్టి, దుమ్ముగూడెం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. పర్ణశాలలోని నారచీరల ప్రాంతంలో ఉన్న సీతమ్మవారి విగ్రహం పూర్తిగా నీట మునిగింది. సున్నంబట్టి–బైరాగులపాడు గ్రామాల మధ్య రహదారిపైకి వరదనీరు చేరి రాకపోకలు నిలిచిపోయాయి.

న్యూస్‌రీల్

ముత్తంగి అలంకరణలో రామయ్య

భద్రాచలం: శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలోని మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. ప్రతీ సోమవారం స్వామివారిని ముత్తంగి రూపంలో అలంకరిస్తారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

23న జాబ్‌మేళా

భద్రాచలం: ఈ నెల 23న భద్రాచలంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలోని గిరిజన నిరుద్యోగులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్‌లోని బయోకాన్ కంపెనీలో అప్రెంటిస్‌గా పనిచేయాలని సూచించారు. బీఎస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, డిప్లొమా కెమికల్, బీటెక్ కెమికల్ చదివినవారు అర్హులని తెలిపారు. అప్రెంటిస్ శిక్షణలో నెలకు రూ. 10,000 స్టైఫండ్ ఇస్తారని పేర్కొనానరు. ఆసక్తి కలిగినవారు ఐటీడీఏలో యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో హాజరు కావాలని కోరారు.

పీహెచ్‌సీలో డీఎంఓ తనిఖీ



బాధితులతో మాట్లాడుతున్న డాక్టర్ స్పందన

చర్ల: మండలంలోని సత్యనారాయణపురం ప్రభుత్వ వైద్యశాలను జిల్లా మలేరియా ప్రోగ్రాం అధికారి(డీఎంఓ) డాక్టర్ స్పందన సోమవారం తనిఖీ చేశారు. రిజిస్టర్లు, ల్యాబ్‌ను పరిశీలించారు. బాధితులను అడిగి వైద్యం అందుతున్న తీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యశాలలో నిర్వహించే ప్రతీ రక్త పరీక్షకు సంబంధించిన రక్త నమూనాను టీ హబ్‌కు కూడా పంపాలని ఆదేశించారు. ఆర్‌ఎంపీలతో సమావేశాలను నిర్వహించి పరిధికి మించి చికిత్స అందించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

విద్యార్థులకు తపాలా స్కాలర్‌షిప్‌లు

ఖమ్మంగాంధీచౌక్ : దీన్ దయాళ్ స్పర్శ యోజన పథకం కింద 2025 – 26 సంవత్సర ఫిలాటలీ స్కాలర్‌షిప్ పథకానికి 6 నుంచి 9వ తరగతి మధ్య చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వి.వీరభద్ర స్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిలాటలీ క్విజ్, ప్రాజెక్టు కార్యక్రమాలను పోస్టల్ డివిజనల్, రీజనల్/సర్కిల్ స్థాయిలో నిర్వహించనున్నామని తెలిపారు. ప్రతిభ కనబర్చిన వారికి నెలకు రూ. 500 చొప్పున ఏడాదికి రూ. 6 వేలు అందిస్తామని తెలిపారు. దరఖాస్తులను 'సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్, ఖమ్మం డివిజన్, ఖమ్మం 507003' అడ్రస్‌కు సెప్టెంబర్ 13 లోగా పంపించాలని తెలిపారు. మరిన్ని వివరాలు www.indiapost.gov.in వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు.

సాగని అన్వేషణ

మణుగూరులో 20 కిలోవాట్ పైలట్ ప్రాజెక్ట్ సక్సెస్

- జియో థర్మల్ పవర్ ప్లాంట్ అభివృద్ధిపై త్రైపాక్షిక ఒప్పందం
- ఏడాది గడిచినా అడుగు ముందుకు పడని వైనం



పగిడేరులో ఏర్పాటు చేసిన జియో థర్మల్ పవర్ ప్లాంట్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: పగిడేరు దగ్గర భూతాప (జియో థర్మల్) క్షేత్రం అన్వేషణ, అభివృద్ధిపై సింగరేణి కాలరీస్, ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఓఎన్‌జీసీ), తెలంగాణ రిన్యూవబుల్ ఎనర్జీ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (తెలంగాణ రెడ్కో) మధ్య గతేడాది ఆగస్టులో త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, ఓఎన్‌జీసీ డైరెక్టర్ (ఎక్స్‌ప్లోరేషన్) సుష్మా రావత్, తెలంగాణ రెడ్కో జీఎం సత్యవరప్రసాద్‌లు ఒప్పంద పత్రంపై సంతకాలు చేశారు. ఏడాది పూర్తయినా అన్వేషణలో అడుగు ముందుకు పడలేదు.

పైలట్ ప్రాజెక్ట్ సక్సెస్

మణుగూరు మండలం పగిడేరు గ్రామం వద్ద భూగర్భం నుంచి వేడి నీరు ఊటలా బయటకు వస్తుంది. ఆ వేడిని ఉపయోగించి థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలపై కొన్నేళ్లుగా సింగరేణి సంస్థ ప్రయోగాలు చేస్తోంది. ప్రయోగాత్మకంగా 20 కిలోవాట్ల ప్లాంట్‌ను ఏర్పాటు చేసి మూడేళ్లపాటు ఫలితాలను పరిశీలించింది. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా కూడా పరిశీలించి మణుగూరులో తొలి దశలో 122 మెగావాట్ల జియో థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు అవకాశం ఉందని నివేదికలో వెల్లడించింది. దీంతో సింగరేణి, ఓఎన్‌జీసీ, రెడ్కో మధ్య త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. 122 మెగావాట్ల ప్రాజెక్టు నుంచి సానుకూల ఫలితాలు వస్తే ఆ తర్వాత దశలవారీగా 3,200 మెగావాట్ల మేరకు జియో థర్మల్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు అవకాశం ఉంటుందనే అంచనాలు నెలకొన్నాయి.

ఒప్పందం ప్రకారం..

త్రైపాక్షిక ఒప్పందాన్ని అనుసరించి మణుగూరు ప్రాంతంలో జియో థర్మల్ విద్యుత్ ఉత్పాదన కేంద్రాల ఏర్పాటుకు గల అవకాశాలను ఓఎన్‌జీసీ అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలి. ప్లాంటు ఏర్పాటుకు అవసరమైన అనుమతులను పొందడానికి తెలంగాణ రెడ్కో సంస్థ సహకరించాలి. స్థానికంగా అవసరమైన ఏర్పాట్లను సింగరేణి సంస్థ చేయాల్సి ఉంది. ఇప్పటికే పర్యావరణ అనుమతులపై అటవీశాఖతో ఒప్పందం కూడా చేసుకున్నారు. ఏడాది గడిచినా త్రైపాక్షిక ఒప్పందం వల్ల సింగరేణికి ఒనగూరిన ప్రయోజనాలు ఏమీ లేవనే వాదనలు వినిపిస్తున్నాయి. జియో థర్మల్ విద్యుత్ ప్రయోగాలు సక్సెస్ అయితే మణుగూరు ప్రాంతంలో హీలియం వెలికితీసేందుకు అవకాశాలు ఉన్నాయంటూ త్రైపాక్షిక ఒప్పందం సందర్భంగా ఓఎన్‌జీసీ డైరెక్టర్ సుష్మారావత్ అన్నారు. దీంతో జియో ప్రాజెక్ట్‌లో ఎటువంటి పురోగతి ఉంటుందనే అంచనాలు సర్వత్రా నెలకొన్నాయి. ఇప్పటికైనా స్తబ్దత వీడి సింగరేణి యాజమాన్యం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

గిరిజన మార్ట్ ఏర్పాటు చేయరూ..

- అటవీ, సంప్రదాయ వస్తువులు ఒకేచోట లభించే సౌకర్యం
- భక్తులు, పర్యాటకుల గిరాకీతో గిరిజనుల ఆర్థికాభివృద్ధి
- మహిళా మార్ట్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలంటున్న ఆదివాసీ సంఘాలు



భద్రాచలంలోని గిరిబజార్

భద్రాచలం: భద్రాచలం ఏజెన్సీ అటవీ వస్తువులు, ఉత్పత్తులు, గిరిజనుల ఆహార శైలితో విభిన్నత చాటుకుంటోంది. వాటి సంరక్షణకు, ప్రచారానికి ఐటీడీఏ కృషి చేస్తోంది. అవన్నీ ఒకేచోట లభించేలా గిరిజన మార్ట్ ఏర్పాటు చేస్తే మరింత ప్రాచుర్యం లభిస్తుంది. గిరిజనులు ఆర్థికాభివృద్ధి సాధించడంతోపాటు భక్తులు, పర్యాటకులు కొనుగోలు చేసుకునేందుకు సులభంగా ఉంటుందని ఆదివాసీ సంఘాలు పేర్కొంటున్నాయి.

ప్రాభవం కోల్పోతున్న గిరిజన స్టోర్‌లు

గిరిజనులు సేకరించే జిగురు, తేనె, కుంకుడు వంటి అటవీ ఉత్పత్తులు గిరిజన సహకార సంస్థ(జీసీసీ) ద్వారా కొనుగోలు చేస్తున్నారు. ప్రధాన పట్టణాల్లో గిరి బజార్ పేరిట ఏర్పాటు చేసిన జీసీసీ స్టోర్లలో విక్రయిస్తున్నారు. కొంతకాలంగా ఇవి ప్రాభవం కోల్పోతున్నాయి. గిరిజనులు సేకరించే ఉత్పత్తులూ తగ్గిపోతున్నాయి. ఈ క్రమంలో సమూల ప్రక్షాళన చేసి అన్ని ఉత్పత్తులు ఒకే చోట విక్రయించేలా గిరిజన మార్ట్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

గిరిజన మ్యూజియం ఏర్పాటు చేసినా..

భద్రగిరి మన్యం ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంది. ఇక్కడ వారి జీవనవిధానం, వ్యవసాయానికి, గృహ అవసరాలకు వాడే పరికరాలు, వస్తువులు, ఆహారం విభిన్నంగా ఉంటాయి. వెదురుతో తయారుచేసే బొమ్మలు, అల్లికలు, ఆటవస్తువులు ఆకట్టుకుంటాయి. వీటన్నింటికీ ప్రాచుర్యం కల్పించేలా ఐటీడీఏ పీఓ రాహుల్ చొరవతో గిరిజన మ్యూజియం ఏర్పాటు చేశారు. కానీ పూర్తిస్థాయిలో భక్తులకు, పర్యాటకులకు అందుబాటులోకి రాలేదు. ఈ క్రమంలో వీటన్నింటిని ఒక్క చోటకు చేర్చి, నిర్వహణ బాధ్యతలను గిరిజన మహిళలు, నిరుద్యోగుల సమాఖ్యలకు అప్పగించాలని పలువురు కోరుతున్నారు.

మహిళా మార్ట్ స్ఫూర్తితో..

భద్రాచలంలో గిరిజన మహిళలు పారిశ్రామిక వేత్తలుగా రూపుదిద్దుకుంటున్నారు. వారు తయారు చేస్తున్న మిల్లెట్ బిస్కెట్లు, సబ్బులు, షాంపులు ఆదరణ పొందుతున్నాయి. ప్రధాన మంత్రి మోదీ సైతం మన్‌కీబాత్‌లో ప్రస్తావించారు. దీంతో దేశస్థాయిలో ప్రచారం లభించింది. వస్తువుల విక్రయానికి ఐటీడీఏ మ్యూజియంలో, దేవస్థానం, పట్టణంలో కేంద్రాలు ఏర్పాటు చేశారు. జీసీసీలో లభించే ఉత్పత్తులు, గిరిజన మహిళా పారిశ్రామిక వేత్తలు తయారు చేసే ప్రొడక్ట్స్, ఆదివాసీల సంప్రదాయ వస్తువులతో గిరిజన మార్ట్ ఏర్పాటు చేయాలని ఆదివాసీ నాయకులు కోరుతున్నారు. ఇటీవల ఖమ్మంలో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్‌తో ఐటీడీఏ పీఓ రాహుల్, ఇతర అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొంటున్నారు. రద్దీగా ఉండే దేవస్థానం పరిసర ప్రాంతాల్లో, ఆర్టీసీ బస్టాండ్‌ల వద్ద వీటిని ఏర్పాటు చేయాలని విన్నవిస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

భద్రాచలం: వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, గిరిజనులు, వైద్యశాఖాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఐటీడీఏ ఏపీఓ డేవిడ్ రాజు సూచించారు. సోమవారం ఐటీడీఏలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో దరఖాస్తులను స్వీకరించారు. వాటిని సంబంధిత యూనిట్ అధికారులకు అందించి, సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు గిరిజనులకు అందేలా కృషి చేయాలని అధికారులకు చెప్పారు. పోడు భూముల పట్టాల కోసం, పట్టాల్లో పేర్లమార్పు, రైతుబంధు, రుణాలు, భూ సమస్యలు, ఉన్నత విద్యకు ఆర్థికసాయం తదితర అంశాలపై పలువురు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. భద్రాచలం బీఈడీ కళాశాలలో సీట్ల కోసం, ఇందిరమ్మ ఇళ్ల కోసం కూడా అర్జీలు సమర్పించారని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు సున్నం రాంబాబు, హరీష్, భాస్కర్, రాజారావు, వేణు, లక్ష్మీనారాయణ, ఉదయ్ కుమార్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు ఏరియాలో డైరెక్టర్ పర్యటన

ఇల్లెందు: సింగరేణి డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ కె.వెంకటేశ్వర్లు ఇల్లెందు ఏరియాలో పర్యటించారు. సోమవారం జేకే–5 ఓసీని సందర్శించి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. వేగంగా ఓబీ పనులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం జీఎం కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. డైరెక్టర్ వెంట ఏరియా జీఎం వీసం కృష్ణయ్య, ఎస్‌ఓటూ జీఎం రామస్వామి, డీజీఎం పర్సనల్ తుకారం, ఇతర అధికారులు కృష్ణమోహన్, నరసింహరాజు, గిరిధర్‌రావు, రవికుమార్, మధుబాబు, పూర్ణచందర్, పాల్గొన్నారు.



ఓసీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు

బొగ్గు ఉత్పత్తికి ఆటంకం..



ఓసీ–4లో నిలిచిన వర్షపు నీరు

మండలంతో పాటు పట్టణంలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేని వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. పలు పాఠశాలలకు స్వచ్ఛందంగా సెలవు ప్రకటించారు. విద్యార్థులు, వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొగా, జనజీవనం స్తంభించి పోయింది. వర్షం ప్రభావంతో సింగరేణిలో మణుగూరు ఓసీ, పీకే ఓసీలలో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర ఆటంకం ఏర్పడిందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. – మణుగూరు టౌన్

సీలింగ్ భూములకు పట్టాలు..

- సీఎం పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి
- రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- దామరచర్లలో సీఎం సభాస్థలి పరిశీలన, ఏర్పాట్లపై సమీక్ష





మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, వేదికపై ఎమ్మెల్యేలు రాగమయి, కోరం, తెల్లం, పాయం, జారె, రాందాస్ (ఇన్‌సెట్) టేకులపల్లి: రాంపురం బ్రిడ్జికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి, కలెక్టర్ జితేష్

టేకులపల్లి/ఇల్లెందురూరల్/ఇల్లెందు/చంద్రుగొండ: నాలుగు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సీలింగ్ భూములకు త్వరలోనే పట్టాలు ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ఇల్లెందు, టేకులపల్లి, చంద్రుగొండ మండలాల్లో పర్యటించారు. ఈ నెల 21న చంద్రుగొండ మండలం బెండాలపాడులో రాష్ట్రంలోనే తొలిసారిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం చేయనున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి పర్యటించి చంద్రుగొండలోని హెలీప్యాడ్, దామరచర్లలోని సీఎం బహిరంగ సభాస్థలిని పరిశీలించారు. సీఎం కాన్వాయ్, ఇతర ప్రముఖుల వాహనాల పార్కింగ్, రూట్‌మ్యాప్, భద్రత ఏర్పాట్లపై ఎస్పీ రోహిత్‌రాజుతో చర్చించి పలు సూచనలు చేశారు. అనంతరం ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడారు. లక్ష మంది ప్రజలతో సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంతకుముందు బెండాలపాడు పాఠశాల ఆవరణలో సీఎం పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్ రాజుతో కలిసి సమీక్షించారు. ముఖ్యమంత్రి పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, ఎలాంటి లోపాలు ఉండొద్దని అధికారులకు సూచించారు. ఇల్లెందు మండలం మేడికుంట శివారులో మసివాగుపై రూ.6 కోట్లతో చేపట్టే బ్రిడ్జి నిర్మాణ పనులకు, సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ లలితాపురం గ్రామం వద్ద రూ.3.60 కోట్లతో చేపట్టే రహదారి వెడల్పు, సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. జేకు సింగరేణి సీఈఆర్ క్లబ్ గ్రౌండ్‌లో నిర్మాణంలో ఉన్న మినీ స్టేడియం అభివృద్ధి పనులకు రూ. 1.50 కోట్లతో శంకుస్థాపన చేయగా, ప్రహరీ నిర్మాణం, గ్రౌండ్ చదును వంటి పనులు చేపట్టనున్నారు.

టేకులపల్లిలో రూ. 12 కోట్లతో అభివృద్ధి పనులు

టేకులపల్లి మండలంలో సుమారు రూ. 12 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కోక్యాతండా నుంచి పాత తడికలపూడి వరకు రూ. 1.25 కోట్లతో, తావుర్యాతండా నుంచి కోక్యాతండా వరకు రూ.1.45 కోట్లతో బీటీ రహదారులు, లక్ష్మీపురం నుంచి పాత తడికలపూడి మధ్య రూ. 83 లక్షలతో కల్వర్ట్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన నిర్వహించారు. రాంపురంలో రూ.2.5 కోట్లతో, పెట్రాంచెలక పేద్ద రూ. 2 కోట్లతో వంతెన, కిష్టారంలో రూ. 3 కోట్లతో చేపట్టనున్న హైలెవల్ వంతెనలకు శంకుస్థాపన చేశారు. సులానగర్ నుంచి ముత్యాలంపాడు వరకు ర్యాలీ నిర్వహించారు. పాతతండాలో మొక్క నాటారు. కిష్టారంలో ఓ బాధితురాలి వైద్యం కోసం ఆర్థిక సాయం అందించారు. కోయగూడెంలోని ఎమ్మెల్యే నివాసంలో భోజనం చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ మామిడిగుండాల ప్రాంతంలో సీలింగ్ భూములకు పట్టాదారు పాస్‌పుస్తకాలు మంజూరు చేస్తామని అన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పలువురు మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఇల్లెందులో మంత్రి పర్యటన జోరువానలోనే సాగింది. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు జారె ఆదినారాయణ, కోరం కనకయ్య, రాందాస్‌నాయక్, పాయం వెంకటేశ్వర్లు, డాక్టర్ మట్టా రాగమయి, తెల్లం వెంకట్రావు, నీటి పారుదల సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, ఆర్డీఓ మధు, హౌసింగ్ పీడీ రవీంద్రనాథ్, ఇల్లెందు ఏఎంసీ చైర్మన్ బానోత్ రాంబాబు, అధికారులు రవికుమార్, ధన్‌సింగ్, శ్రీనివాస్ రావు, రాంప్రసాద్, శ్రీకాంత్, పీసీసీ కార్యదర్శి నాగా సీతారాములు, మున్సిపల్ మాజీ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు ముక్తి కృష్ణ, పులి సైదులు, మండల రాము, మహేష్, కోరం సురేందర్, దేవా, రెడ్యానాయక్, రాంబాబు, లక్కినేని సురేందర్, దళ్‌సింగ్, ధర్మయ్య పాల్గొన్నారు. ఇల్లెందు డీఎస్పీ చంద్రబాను, సీఐలు బత్తుల సత్యనారాయణ, రవీందర్ బందోబస్తు నిర్వహించారు.

క్లుప్తంగా

డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ట్రెయినీ కలెక్టర్


మొక్క అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా వైద్య, ఆరోగ్య శాఖా కార్యాలయాన్ని ట్రెయినీ కలెక్టర్ సౌరభ్‌శర్మ సోమవారం సందర్శించారు. డీఎంహెచ్‌ఓ ఎస్.జయలక్ష్మి పూలమొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఆయన వారం రోజుల వరకు డీఎంహెచ్‌ఓ కార్యాలయ పనులను పరిశీలించనున్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు మధువరన్, పి.స్పందన, సుకృత, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఫైజ్ మొహియునద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పన్నుల ఆదాయంలో రాష్ట్రాల వాటా ఎంత?

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర పన్నుల నికర ఆదాయంలో 2024 – 25 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రాలకు రావాల్సిన వాటా ఎంత..? అని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి లోక్‌సభలో ప్రశ్నించారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా సోమవారం ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ రాష్ట్రాలకు వాటాపై 15వ ఆర్థిక సంఘం సూచన, ప్రభుత్వం చేపట్టిన అధికార వికేంద్రీకరణ స్థాయి, రాష్ట్ర నిర్దిష్ట గ్రాంట్ల వివరాలను తెలపాల్సిందిగా కోరారు. దీనికి కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. రాష్ట్రాల వాటా రూ. 12.86 లక్షల కోట్లు. 2024 – 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్నులు, సుంకాల నికర ఆదాయంలో రాష్ట్రాల వాటా మొత్తం రూ.12,86,885.44 కోట్లు ఉన్నట్లు తెలిపారు. 41 శాతం తక్కువగా ఉందా..? అని ఎంపీ ప్రశ్నించగా 15వ ఆర్థిక సంఘం ఆమోదించిన సిఫార్సుల ప్రకారం ఉన్నట్లు పేర్కొన్నారు. స్థానిక సంస్థలకు కేంద్రం నేరుగా ఎలాంటి పన్ను కేటాయించలేదని తెలిపారు.

రామకృష్ణాపురం రైల్వే బ్రిడ్జిపై కదలిక..

ఖమ్మంవైరారోడ్: చింతకాని మండలం రామకృష్ణాపురం 107 రైలు క్రాసింగ్ వద్ద బ్రిడ్జి నిర్మాణంపై కదలిక వచ్చింది. ఈ అంశం కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉందని రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్ రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు తెలిపారు. ఈ మేరకు ఎంపీ రవిచంద్ర ఆగస్టు 7వ తేదీన రైల్వే మంత్రికి రాసిన లేఖలో రామకృష్ణాపురం గ్రామ సమీపంలోని 107 లెవల్ క్రాసింగ్ వద్ద బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ విజ్ఞప్తి చేశారు. తరచూ గేటు మూసి ఉంచడం వల్ల గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్ ఎంపీ రవిచంద్రకు తిరిగి లేఖ రాశారు. చింతకాని మండలం రామకృష్ణాపురం 107 లెవల్ క్రాసింగ్ వద్ద ఆర్వోబీ నిర్మాణం కోరుతూ చేసిన వినతిపై సాధ్యాసాధ్యాలకు సంబంధించి సమగ్ర నివేదిక కోరుతూ రైల్వే ఉన్నతాధికారులు ఆదేశం చారని తెలిపారు.

దాడి చేసినవారిపై కేసు

ములకలపల్లి: తన కొడుకుపై దాడి చేశారంటూ మంగపేట గ్రామానికి చెందిన సడియం వీరభద్రం ఫిర్యాదు చేయగా సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ మధుప్రసాద్ కథనం మేరకు.. మంగపేట గ్రామానికి చెందిన సడియం శివ ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్తుండగా తండ్రి వీరభద్రం ప్రశ్నించాడు. తన స్నేహితులు వాడే శ్రీను, మడివి జంపన్న, వర్సా చరణ్ పిలిచారని, అందుకే వెళ్తున్నట్లు తెలిపాడు. కొద్దిసేపటి తర్వాత శివ ఒంటిపై గాయాలతో ఇంటికి వచ్చాడు. ఏం జరిగిందని అడుగగా.. శ్రీను సోదరికి ఫోన్లో మేసేజ్ చేస్తున్నానని ఆరోపిస్తూ దాడి చేశారని చెప్పాడు. బాధితుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

లారీడ్రైవర్‌ను మోసగించిన సైబర్ దుండగులు

ఖమ్మంఅర్బన్: రెట్టింపు లాభం వస్తుందని నమ్మించి లారీడ్రైవర్ నుంచి రూ.83,940ను కాజేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఖమ్మం అర్బన్ (ఖానాపురం హవేలి) పోలీస్‌స్టేషన్లో సోమవారం సైబర్ క్రైమ్ కేసు నమోదైంది. సీఐ భానుప్రకాశ్ కథనంప్రకారం..నగరంలోని శ్రీరాంనగర్‌కు చెం దిన షేక్‌జానీహుస్సేన్‌లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నా డు.'పెట్టుబడి పెడితే రెట్టింపులాభం వస్తుంది' అంటూ సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ప్రకటనను నమ్మి, మిత్రుడి సూచన మేరకు గత జూలై 23, 24 తేదీల్లో రూ.83,940 వివిధ దఫాలుగా చెల్లించాడు. తర్వాత సంబంధిత ఖాతా బ్లాక్ అవడంతో మోసపోయానని సైబర్ క్రైమ్ నంబర్ 1930కి ఫిర్యాదు చేశాడు. వెంటనే రూ.18 వేలు డ్రా కాకుండా నిలువరించారు. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.18,052

ఎన్నడూ ఎరగని కష్టం..


సుజాతనగర్: యూరియా కోసం గుమికూడిన రైతులు

- యూరియా కోసం రైతుల అగచాట్లు వర్ణతీతం
- తెల్లవారుజాము నుంచే సొసైటీ కార్యాలయం వద్దకు వస్తున్న అన్నదాతలు
- పోలీసుల పహారా మధ్య కూపన్ల పద్ధతిలో యూరియా పంపిణీ


కరకగూడెం: యూరియా కోసం వేచి ఉన్న రైతులు

తల్లాడ/సుజాతనగర్/కరకగూడెం/బూర్గంపాడు: యూరియా కోసం కనివినీఎరుగని కష్టం రైతులకొచ్చింది. యూరియా కోసం ఎన్నడూ తిప్పలు పడని రైతులు.. ప్రస్తుతం నానా అవస్థలు పడుతున్నారు. తెల్లవారింది మొదలు యూరియా కోసం పరుగులు పెడుతున్నారు. ఉదయం నాలుగు గంటలకే సొసైటీ కార్యాలయాల వద్ద బారులుదీరుతున్నారు. సోమవారం తెల్లవారుజామున 4 గంటల నుంచే తల్లాడ సొసైటీ కార్యాలయం వద్ద క్యూకట్టారు. తల్లాడ సొసైటీకి 911 కట్టల యూరియా వచ్చిందనే సమాచారం తెలియడంతో రైతులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. అతి పెద్ద సొసైటీ అయిన తల్లాడలో 15 గ్రామాలున్నాయి. ఈ గ్రామాలకు చెందిన వెయ్యి మంది రైతులు సొసైటీ కార్యాలయానికి వచ్చారు. వచ్చిన వారందరికీ యూరియా ఇవ్వాలనీ రైతులు పట్టుబట్టారు. బీజేపీ జిల్లా నాయకులు ఆపతి వెంకటరామారావు ఆధ్వర్యంలో సొసైటీ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. తల్లాడ మండల వ్యవసాయాధికారి ఎండీ తాజుద్దీన్, ట్రెయినీ ఎస్‌ఐ వెంకటేశ్, సొసైటీ సీఈఓ నాగబాబు ఆధ్వర్యంలో రైతులకు కూపన్లు పంపిణీ చేశారు. వచ్చిన ప్రతి రైతుకు ఒక కూపన్ చొప్పున పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను పరిశీలించి అందించారు. ఈ కూపన్లు పొందిన రైతులకు మాత్రమే యూరియా కట్టలందజేశారు. కూపన్లు అందని రైతులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఒకే రోజు యూరియా కట్టలు పంపిణీ చేయడం వీలు పడక మంగళవారం నాడు కూపన్లు పొందిన రైతుల్లో సగంమందికి యూరియా పంపిణీ చేస్తామని అధికారులు ప్రకటించారు. ఓ పక్క వర్షం పడుతున్నా రైతులు యూరియా కోసం తడుచుకుంటూనే నిల్చున్నారు. యూరియా కొరత కారణంగా వచ్చిన వారిలో చాలా మందికి యూరియా అందలేదు. యూరియా వేయాల్సిన తరుణంలో కొరత ఏర్పడటంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. ఇక సుజాతనగర్ సొసైటీ గోదాముకు యూరియా వచ్చిన విషయం తెలుసుకున్న ఆయా గ్రామాలకు చెందిన పురుషులు, మహిళా రైతులు సోమవారం పెద్దఎత్తున తరలివచ్చారు. వ్యవసాయ పనులు ఊపందుకోవడంతో యూరియా అవసరం పెరిగింది. ఆధార్‌కార్డుకు ఒకే బస్తా చొప్పున ఇస్తామని చెప్పడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గంటల తరబడి వేచి ఉన్నా కొందరికే యూరియా బస్తాలు అందడంతో మరికొందరు బస్తాలు దొరక్క నిరాశతో వెనుదిరిగారు. అవసరానికి మించి యూరియాను కొనుగోలు చేసి నిల్వ ఉంచుకోవద్దని ఏఓ నర్మద తెలిపారు. మండలంలో రైతులందరికీ సరిపడా యూరియాను సరఫరా చేసేందుకు వ్యవసాయశాఖ సిద్ధంగా ఉందని చెప్పారు. కాగా, రైతులకు సరిపడా యూరియా అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కౌలు రైతు సంఘం రాష్ట్ర నాయకులు నల్లగోపు పుల్లయ్య ఆరోపించారు. అలాగే, కరకగూడెంలోని ప్రాథమిక సహకార సంఘం సేల్ పాయింట్ వద్ద రైతులు జోరు వానను సైతం లెక్కచేయకుండా క్యూలో నిలబడి యూరియా కోసం నిరీక్షించారు. గొడుగులు పట్టుకుని, రెయిన్ కోట్లు వేసుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరీక్షించినా కొందరు రైతులకు మాత్రమే యూరియా అందింది. స్టాక్ అయిపోవడంతో పలువురు ఖాళీ చేతులతోనే వెనుదిరగాల్సి వచ్చింది. దీంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే, బూర్గంపాడు మండలంలోని మోరంపల్లిబంజర పీఏసీఎస్ గోదాంకు వచ్చిన ఒక లారీ యూరియా కోసం సుమారు 500 మంది రైతులు రాగా.. పంపిణీ చేసేందుకు అధికారులు కూడా ఇబ్బంది పడ్డారు. రైతుకు ఒక యూరియా బస్తా చొప్పున విక్రయించారు. అయినప్పటికీ ఇంకా చాలామంది రైతులకు అందక నిరాశగా వెనుదిరిగారు.

వారం నుంచి తిరుగుతున్నా యూరియా అందలేదు



వారం రోజులుగా యూరియా కోసం తల్లాడ సొసైటీ కార్యాలయం వద్దకు వచ్చి పోతున్నాను. యూరియాఒక్కకట్ట కూడా ఇవ్వ లేదు. యూరియా వేయాల్సిన తరుణంలో అందక పోవటంతో ఇబ్బంది పడాల్సి వస్తోంది. గతంలో ఎన్నడూ ఇంత ఇబ్బంది పడలేదు. యూరియా లోడ్ వచ్చిన రోజు ముందు వచ్చిన రైతులకే కూపన్లు ఇస్తున్నారు. చుట్టు పక్కల గ్రామాల రైతులు వచ్చే సరికి కూపన్లు అయిపోయాయని చెబుతున్నారు.

– వి.వంశీకృష్ణారెడ్డి, రైతు, పినపాక

పదెకరాలుంటే మూడు కట్టలిచ్చారు..



పదెకరాలుంటే మూడు యూరియా కట్టలు కూపన్ల పద్ధతిలో ఇచ్చారు. కూపన్ల కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది. ఎకరానికి ఒక కట్ట తప్పని సరిగా యూరియా వేయాలి. దీంతో ఇంకా ఏడు కట్టలు అవసరం ఉన్నది. అధికారులను అడిగితే మళ్లీ లోడ్ వస్తే ఇస్తామంటున్నారు. యూరియా కొరత వేధిస్తోంది.

–కొలిపాక శ్రీనివాసరావు, రైతు, బిల్లుపాడు

నవంబర్‌లో పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలు

సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పృథ్వీ, అనిల్



మాట్లాడుతున్న అనిల్ సాయిబోలా

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం జిల్లా కేంద్రంలో నవంబర్ మూడో వారంలో పీడీఎస్‌యూ రాష్ట్ర 23వ మహాసభలు నిర్వహించనున్నామని సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కాంపాటి పృథ్వీ, అనిల్ సాయిబోలా అన్నారు. సోమవారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. 1960 దశకం చివరిలో ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా పీడీఎస్‌యూ పురుడు పోసుకుందని, జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, కొలా శంకర్, చేరాలు వంటి ఎంతోమంది.. విద్యార్థుల హక్కుల కోసం, శాస్త్రీయ విద్య, సమానత్వ సమాజ స్థాపనను కాంక్షిస్తూ విద్యార్థి ఉద్యమంలో అమరులయ్యారన్నారు. ఎన్నో సామాజిక, ప్రజాతంత్ర, విప్లవోద్యమాలకు పురిటిగడ్డ అయిన ఖమ్మం జిల్లా కేంద్రంలో పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలను నిర్వహించనున్నామని, వీటిని విజయవంతం చేయాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యారంగాన్ని కాషాయీకరించేందుకు దుర్మార్గ సంస్కరణలకు పూనుకుంటోందన్నారు. సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు, నరేందర్, అఖిల్ కుమార్, సహాయ కార్యదర్శి వెంకటేశ్, ఎస్.సాయికుమార్, సురేశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లక్ష్మణ్, అంగిడి కుమార్, అలవాల నరేశ్, మునిగల శివ, అజయ్, నాగరాజు, అషూర్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసు నిందితుడికి జీవిత ఖైదు

ఖమ్మంలీగల్: హత్య కేసులో నిందితుడైన రఘునాథపాలెం మండలం కోటపాడుకు చెందిన బాలంటు నాని (22)కి జీవిత ఖైదు, రూ.10,000 జరిమానా విధిస్తూ రెండో అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి వెంపటి అపర్ణ సోమవారం తీర్పు వెల్లడించారు. మద్యానికి అలవాటు పడిన నిందుతుడు నాని అదే గ్రామానికి చెందిన తేలూరి రమేశ్‌ను డబ్బుల కోసం బెదిరించాడు.
ఇవ్వకపోయే సరికి అదును చూసి, 2023 జనవరి 12న రమేశ్‌ను కత్తితో పొడిచి హత్య చేశాడు. మృతుడి సోదరుడు తేలూరి వీరబాబు ఫిర్యాదు మేరకు రఘునాథపాలెం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. వాదోపవాదాలు విన్న న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగరాజు

బూర్గంపాడు: హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఇన్‌చార్జ్ సీఐ నాగరాజు తెలిపారు. సోమవారం బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 11న గ్యాస్ సిలిండర్ అపహరించాడనే కారణంతో అశ్వాపురం మండలం మల్లెలమడుగు గ్రామానికి చెందిన కడియం సర్వేశ్వరరావు(32)పై ఇద్దరు వ్యక్తులు సిమెంట్ డంబెల్స్‌తో దాడికి పాల్పడ్డారు. తీవ్రంగా గాయపడిన సర్వేశ్వరరావును వరంగల్ ఎంజీఎంకు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ 16న మృతి చెందాడు. మృతుడి తల్లి కడియం రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. టేకులపల్లి మండలం బొమ్మనపల్లి గ్రామానికి చెందిన కొండల సంతోష్, అదే గ్రామానికి చెందిన చర్లపల్లి శివ ఈ హత్యకు పాల్పడినట్లు విచారణలో తేలింది. బొమ్మనపల్లిలోని చర్లపల్లి శివ ఇంటి నుంచి గ్యాస్ సిలిండర్‌ను చెప్పకుండా సర్వేశ్వరరావు తీసుకొచ్చాడనేకారణంతో నిందితులు సర్వేశ్వరరావుతో గొడవ పడి, దాడి చేశారని సీఐ చెప్పారు. విచారణ అనంతరం నిందిలిద్దరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. సమావేశంలో బూర్గంపాడు ఎస్‌ఐలు మేడ ప్రసాద్, దేవ్‌సింగ్ ఉన్నారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

ఖమ్మంరూరల్:మండలంలోని పల్లెగూడెంనకు చెందిన ఎస్.లెనిన్ (30) ఉరి వేసు కుని సోమవారం ఆత్మహత్యచేసుకున్నాడు. పోలీసుల కథనంప్రకారం.. లెనిన్ కొం తకాలం కిందట అదే గ్రామానికి చెందిన మానసను ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. కొంతకాలంగా లెనిన్ మద్యానికి బానిసయ్యాడు. సోమవారం తన ఇంటి పక్కనే ఉన్న అత్తవారింటికి వెళ్లి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆయ న్ను ఖమ్మంలోనిఓప్రైవేట్ ఆస్పత్రికితరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజు తెలిపారు.

పెట్రోల్ డబ్బాతో మహిళ హల్‌చల్

నేలకొండపల్లి: ఓ మహిళ పెట్రోల్ డబ్బాతో హల్‌చల్ చేసింది. స్థానికుల కథనం ప్రకారం.. నేలకొండపల్లికి చెందిన ఓ మహిళ ఇంట్లో రెండు రోజుల నుంచి తగాదాలు నడుస్తున్నాయి. కోడలిపైఅత్త పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతోకోడలు సోమవారంఅంబేడ్కర్ సెంటర్‌లో పెట్రోల్‌డబ్బా పట్టుకుని హల్‌చల్ చేసింది. కుటుంబ సభ్యులతో వాగ్వాదానికి దిగింది. తాను ఆత్మహత్య చేసుకుంటానని పెట్రోల్‌పోసుకుంది. స్థానికులు గమనించి అడ్డుకుని అక్కడినుంచి పంపించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని కరుణగిరి టీఎన్‌జీవోస్‌కాలనీ రోడ్ నంబర్–6కు చెందిన దేవరకొండ వెంకట్ అనిల్‌కుమార్ (41) వాటర్ హీటర్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వాటర్ ప్లాంట్ నిర్వహించే అనిల్‌కుమార్ రోజు మాదిరిగానే ఉదయం స్నానం చేయడానికి, నీళ్ల వేడిచేసేందుకు వాటర్ హీటర్ ప్లగ్ పెట్టి స్విచ్ వేయగా విద్యుదాఘాతానికి గురై పడిపోయాడు. మరోగదిలో నిద్రపోతున్న భార్య శైలజ మేల్కొని అపస్మారక స్థితిలో పడి ఉన్న భర్తను చూసి కేకలు వేయగా పక్కింటి వారు వచ్చి సీపీఆర్ చేశారు. కానీ, అప్పటికే మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ రాజు తెలిపారు.


గుట్టను కప్పేసిన మేఘం..

గుట్టపై వాలిన మేఘం..

కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాతావరణం చల్లబడింది. దీంతో కొండలు, గుట్టలు, కోనలు పచ్చదనంతో ఆహ్లాద పరుస్తున్నాయి. అశ్వారావుపేట మండలం వినాయకపురం – కొత్తమామిళ్లవారిగూడెం గ్రామాల మధ్యలో యర్రగుంటపల్లి గ్రామంలో ఎత్తయిన గుట్టలు ఉన్నాయి. ఉదయం నుంచి ముసురు పడుతుండటంతో గుట్టలను మేఘాలు దట్టంగా కప్పేశాయి. ప్రధాన రహదారి దగ్గరల్లోనే ఉన్న ఈ గుట్టలు కనిపించకుండా మేఘాలు ఆవరించడం చూపరులను కట్టిపడేసింది. ఈ దృశ్యాన్ని సోమవారం 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది.

– అశ్వారావుపేటరూరల్

ఇంత జరిగినా నిర్లక్ష్యమే..

- కల్లూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో మళ్లీ ఫుడ్ పాయిజన్
- ఐటీడీఏ పీఓ హెచ్చరించినా తీరుమారని అధికారులు
- సాయంత్రం స్నాక్స్‌ను రాత్రి భోజనంలో పెట్టిన వైనం
- స్వాతంత్య్ర వేడుకల స్టాళ్ల ప్రదర్శనలోనూ బయటపడిన నిర్లక్ష్యం



కల్లూరులోని గిరిజన ఆశ్రమ పాఠశాల

ఖమ్మంమయూరిసెంటర్: సంక్షేమ శాఖల వసతి గృహాల నిర్వహణపై అధికారుల నిర్లక్ష్యం మరోసారి బట్టబయలైంది. విద్యార్థులకు సురక్షితమైన వసతి, భోజన సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యతను పక్కన పెట్టి, వారి ఆరోగ్యాన్ని గాలికొదిలేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. 14రోజుల వ్యవధిలోనే ఒకే ఆశ్రమ పాఠశాలలో రెండు సార్లు విద్యార్థినులు ఫుడ్‌పాయిజన్‌కు గురికావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఐటీడీఏ పీఓ హెచ్చరించినా.. జిల్లా అధికారులు, స్థానిక అధికారులు, సిబ్బందిలో మార్పు రాకపోవడంపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలోని కల్లూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో శనివారం రాత్రి తిన్న భోజనంతో విద్యార్థులు అస్వస్థతకు గురికావడం అధికారులు, సిబ్బంది అలసత్వానికి నిదర్శనమని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నేతలు విమర్శిస్తున్నారు.

వరుస ఘటనలు..

కల్లూరు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఈ నెల 3న ఆదివారం అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో మధ్యాహ్నం వండిన చికెన్ రాత్రి తినడం, ఆ మరునాడే ఉదయం ఉడికీ ఉడకని కిచిడి తినడంతో 15 మందికి పైగా విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఆ ఘటన మరువక ముందే ఈ నెల 16న శనివారం సాయంత్రం విద్యార్థినులకు అందించాల్సిన స్నాక్స్ (క్యాబేజీ పకోడి) రాత్రి భోజనంతో పాటు అందించడంతో పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఒకే ఆశ్రమ పాఠశాలలో వరుసగా రెండు ఘటనలు చోటు చేసుకోవడంతో నిర్వహణ, జిల్లా అధికారుల పర్యవేక్షణ ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

సమయపాలన లేదు..

గిరిజన సంక్షేమ వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాల ల్లో విద్యార్థులకు అందించాల్సిన అల్పాహారం, భోజనం, స్నాక్స్ వంటి వాటికి సమయపాలన లేదనే విమర్శలు వస్తున్నాయి. మధ్యాహ్నం వండిన చికెన్ సాయంత్రం, సాయంత్రం 4 గంటల సమయంలో అందించాల్సిన స్నాక్స్ రాత్రి భోజనంతో పెడుతున్నారు. జిల్లాలోని అన్ని గిరిజన వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో ఇలానే జరుగుతోందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కల్లూరులో శనివారం సాయంత్రం తయారు చేసిన స్నాక్స్ రాత్రి భోజనంతో అందించడంపై అధికారులు ఆరా తీ యగా.. హెచ్‌ఎం సరుకులు ఆలస్యంగా ఇచ్చా రని వర్కర్లు, వర్కర్ ఆలస్యంగా వంట తయారు చేశా రని హెచ్‌ఎం ఫిర్యాదు చేసినట్లు సమాచారం. కాగా, కల్లూరు ఆశ్రమ పాఠశాలలో ఐటీడీఏ పీఓ పర్యటించి వార్డెన్ నిర్లక్ష్యంతోనే ఫుడ్ పాయిజన్ జరిగినట్లు నిర్ధారించి సస్పెండ్ చేశారు. ఆహారం తయారు చేసిన సిబ్బందిపై చర్యలు తీసుకోలేదు. ఇలాంటి ఘటనలు పునరావృతం కావొద్దని అధికారులు, హెచ్‌ఎంలు, వసతిగృహ సంక్షేమ అధికారులను హెచ్చరించారు. అయినా వారు సీరియస్‌గా తీసుకున్నట్లు కనిపించడం లేదు. అదే ఆశ్రమ పాఠశాలలో మరో ఘటన చోటు చేసుకుందనే ఆరోపణలు ఉన్నాయి. వంట చేసిన వారిని అధికారులు వేరే వసతిగృహానికి మార్చి చేతులు దులుపుకున్నట్లు తెలిసింది.

ఉప ముఖ్యమంత్రి ఆగ్రహం..

గిరిజన అభివృద్ధి శాఖ అధికారుల నిర్లక్ష్యం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముందే బయటపడింది. ఈ నెల 15న స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా పోలీస్ పరేడ్ మైదానంలో వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమశాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లలో నోట్‌బుక్స్‌పై కేసీఆర్, సత్యవతిరాథోడ్ ఫొటోలు ఉండడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. కల్లూరు ఆశ్రమ పాఠశాల ఘటనపై జిల్లా గిరిజన అభివృద్ధి అధికారిణి విజయలక్ష్మిని వివరణ కోరగా.. సాయంత్రం చేసిన స్నాక్స్ రాత్రి భోజనంతో పాటు తినడంతో విద్యార్థినులకు కడుపు నొప్పి వచ్చిందని, ఘటనలో వర్కర్‌ను అక్కడి నుంచి మార్చామని తెలిపారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడు అరెస్ట్

వాజేడు: మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ ఆమె భర్త మృతికి కారణమైన ప్రభుత్వ ఉపాధ్యాయుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా, ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరా లు ఇలాఉన్నాయి. జూలురుపాడు మండలం సూర్యాతండాకు చెందిన వాంకుడోత్ భాష్‌సింగ్ ములుగు జిల్లా వాజేడు మండలం బిజినేపల్లి ప్రభు త్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో జూలురుపాడుకు చెందిన ఓ మహిళతో పరిచయం ఏర్పడి అదికాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. సదరు మహిళ భర్తకు విషయం తెలియడంతో ఆయన నోట్ రాసి, సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సూసైడ్ నోట్, సెల్ఫీ వీడియో ఆధారంగా కేసు నమోదు చేసిన కొత్తగూడెం పోలీసులు మహిళతో వివాహేతర సంబంధం నెరుపుతున్న సదరు ఉపాధ్యాయుడిని ఈ నెల 11న అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం. ఈ విషయంపై ఎంఈఓ వెంకటేశ్వర్లును వివరణ కోరగా భాష్‌సింగ్‌ను అరెస్ట్ చేసిన మాట వాస్తవమేనని, కానీ, తనకు, జిల్లా విద్యాశాఖకు ఎలాంటి సమాచారం లేదని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా సమీపంలోని మొరుమూరు పాఠశాల నుంచి ఓ ఉపాధ్యాయుడిని బిజినేపల్లి పాఠశాలకు పంపిస్తున్నట్లు తెలిపారు.

కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీకి చెందిన మాధవి, ఈ నెల 16న తన ఇద్దరు కూతుళ్లతో కలిసి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఆమె తండ్రి మారేశ్ సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా టౌన్ ఎస్‌ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కాగా మాధవి ఇంట్లో నుంచి బయటకు వెళ్తున్న సమయంలో ఆమె తోటికోడలు ఎక్కడికి వెళ్తున్నారని అడగగా.. పిల్లల ఆధార్‌కార్డులో మార్పు చేయించడానికని చెప్పిందని, మాధవి భర్త దుర్గాప్రసాద్ భద్రాచలం సరిహద్దున ఉన్న ఎటపాకలో ఇస్త్రీ బండి నడుపుతుంటాడని పోలీసులు తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

అశ్వాపురం: మండలంలోని అమెర్దగ్రామానికి చెందిన ఇరుగు భద్రమ్మను బెదిరించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు సీఐ అశోక్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమెర్ద గ్రామానికి చెందిన నజీర్, ఇరుగు నరసింహారావు ఇద్దరు భద్రమ్మ ఇంట్లోకి ప్రవేశించారు. అమె భర్తతో అసభ్యంగా ప్రవర్తించారు. తమకు డబ్బులు ఇస్తేనే ఇక్కడ చర్చి ఉంటుందని, లేకపోతే పీకేస్తామని బెదిరించారు. భద్రమ్మ ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేశామని సీఐ వెల్లడించారు.

ఇద్దరు వ్యక్తుల మధ్య ఘర్షణ

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఏషియన్ సినిమా హాల్ ఎదుట ఆదివారం రాత్రి జరిగిన దాడిపై ఇరువర్గాలపై కేసు నమోదైనట్లు టౌన్ పోలీసులు తెలిపారు. ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వాహకుడు కిరణ్.. ఫ్రైడ్ రైస్ అయిపోయాయని చెప్పడంతో కస్టమర్ వాసు కిరణ్‌పై దాడి చేశాడు. ఈ క్రమంలో కిరణ్ తన పక్కనే ఉన్న నూనెను వాసుపైకి విసిరాడు. ఇరువర్గాలకు చెందిన వ్యక్తులు స్థానిక పోలీస్ స్టేషన్ ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

దుమ్ముగూడెం: మండలంలోని తూరుబాక గ్రామవాసి జక్కుల నవీన్ ఇంట్లో గుర్తు తెలియని దుండగులు ఆదివారం అర్ధరాత్రి చోరీకి పాల్పడిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు సీఐ అశోక్ సోమవారం తెలిపారు. నవీన్ తన కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా కిటికీలు పగులకొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించాడు. బీరువా లాకర్ పగులకొట్టి అందులోని 15 గ్రాముల బంగారం, నగదు చోరీ చేసినట్లు బాధితుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వివరించారు.